## హాస్యం హాస్యం

# హిస్టీరియా

చిట్టిబాబు రమణిని గాఢంగా ప్రేమించాడు. అది వన్ వే కాకూడదని అతని తాపత్రయం. ఈ రోజు అటో ఇటో తేల్చుకోవాలని బయలుదేరాడు. రోడ్డు వెంట నడుస్తుంటే ఆమె గుర్తుకొస్తున్నది. ఆమె ఊహలలో తేలిపోతున్న చిట్టిబాబుకు రమణి స్వయంగా ఎదురొచ్చింది. ఆనందంగా ''మీరా?'' అన్నాడు.

''మీరాను కాదు రమణిని'' అన్నది విరుకోపం ప్రదర్శిస్తూ.

నాలుక కరుచుకున్నాడు చిట్టిబాబు.

''అలా నాలుక కరుచుకోకండి. తెగిపోతుంది. మూగవారయితే ఇలా మూగసైగలు చేసుకోవాల్సిందే'' అన్నది రమణి.

చిట్టిబాబు పకపకా నవ్వాడు. రమణి కిలకిలా నవ్వింది.

''మీరు భలేగా నవ్వుతారే'' మురిపెంగా చూస్తూ అన్నాడు.

''ఏడుపు కూడా భలేగా ఏడుస్తాను. ఏడవనా?'' అడిగింది రమణి.

''అంత పనిచేయకండి. మిమ్మల్ని ఏమైనా చేశానని అందరు కలిసి దేహశుద్ధి చేసి జెలులో పెట్టినా పెడతారు'' భయంగా చెప్పాడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

'' మీ పేరు రమణి అని పెట్టారు కానీ, నవ్వుల రాణి అని పెట్టాల్సింది.''

''మీకు పేరు పెట్టడం భలే వచ్చే!'' అన్నది ఆశ్చర్యంగా చూస్తూ—


''ప్రతి వారికి ఓ నిక్ నేమ్ పెట్టగలను.''

''ఆహా! అలాగా!'' అన్నది రమణి.

''ఆహా! అంటే అర్థం తెలుసా మీకు?'' ఆమె మొహంలోనికి చూస్తూ అడిగాడు.

''అంటే ఆశ్చర్యం ప్రకటించడం కదా!''

''కాదు. మీరు అర్జంటు పని లేకుంటే అలా పార్కులో కెళ్ళి కూర్చుందాం.'' అంటూ దగ్గిరలోని పార్కులోనికి దారి తీశాడు చిట్టిబాబు. అతని ఆలోచనలను అంచనా వేస్తున్నది రమణి.




''అయితే అర్థం చెప్పండి'' అన్నది అతనికి కాస్త ముందుగా కూర్చుని.

''ఎదుటివారు చెప్పేది వినలేక విసుగనిపిస్తే మొహాన చెప్పలేక ఆపు నీ హరికథ అని షార్ట్ ఫాంలో చెప్పడం'' చిట్టిబాబు మాటలకు ఆమె పడి పడీ నవ్వింది. అందులో పెద్ద జోకూ లేకపోయినా ఆమెకు మరింత దగ్గిర కావటానికి అతనుకూడా నవ్వాడు.

''ఎలా వుందీ గాలి?'' అడిగాడు చిట్టిబాబు.

''ఏ గాలి? చల్లగాలా? పిల్లగాలా? లేక చిట్టిగాలా?'' అమాయకంగా అడిగింది రమణి.

ఆడపిల్ల ప్రక్కనుంటే పిల్లగాలి, ప్రక్కన లేకుంటే విరహాగాలి, ప్రేమించకపోతే చల్లగాలి, ప్రేమించడం తెలియకపోతే చిట్టిగాలి'' అన్నాడు.

''మీకు చాలా గాలులు తెలుసే!'' అన్నది రమణి.

అవును! తనకిన్ని గాలులు ఎలా తెలుసు అనుకుని ''ఇంతకీ మనకే గాలి అవసరం'' అన్నాడు మురిపెంగా చూస్తూ.

''మీకు పిల్లగాలి, నాకు చల్లగాలి'' అన్నది రమణి.

''ఈ రోజు మీ అభిప్రాయం చెబుతామన్నారు? చెప్పరేం!'' ఆశగా, ఆబగా, ఆదుర్దాగా, ఆందోళనగా అడిగాడు చిట్టిబాబు.

''చెప్పాలంటే నాకు సిగ్గేస్తోంది బాబూ!''

అతనిలో ఆనందం కట్టలు తెంచుకున్నది. ఇంతకాలం ఎదురుచూస్తున్న ఘడియ రానే వచ్చింది. అయితే రమణి తనను ప్రేమిస్తున్నదని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ 'హుర్రే' గట్టిగా అరిచాడు రెండు చేతులు పైకెత్తి. రమణి కెవ్వున అరచి భయంతో వణికిపోతోంది. ఆమె అవస్థను చూసి చిట్టిబాబు పకపకా నవ్వాడు పళ్ళు బయటకు పెట్టి.

పార్కులోని జనం ఒక్కసారే కోపంతో చిట్టిబాబు చుట్టు ముట్టారు.

''ఏమైంది? ఏమైంది'' భయం భయంగా చూస్తూ అడిగాడు చిట్టిబాబు.

''మిట్ట మధ్యాహ్నం చెట్టుకు వ్రేలాడే పిశాచంలా ఎందుకలా అరిచావ్! మా పిల్లలు భయంతో బట్టలలోనే ఒంటేలు కెళ్ళారు.'' కళ్ళెర చేశాడు.

''నీ దిక్కుమాలిన కేకకు భయపడి నా లవర్ పారిపోయింది. రాకరాక వచ్చిన అవకాశం నాశనం అయిపోయింది.'' ఓ టీనేజ్ కుర్రాడు పొదలలో నుండి వచ్చినట్లున్నాడు ఒంటి మీద ఆకులు వున్నాయి.

—మహర్షి

"నా లవర్ స్పృహ తప్పి పడిపోయింది. నీ అరుపు విని" పిచ్చి గంతులు వేశాడు మరొకతను.

"నా భార్య నోట మాట రాకుండా పడిపోయింది. అదిపోతే పోయిందిలే. నేను హాయిగా రెండవ పెళ్ళి చేసుకుంటాను. కానీ, దాని పేరు మీద ఇన్సూరెన్స్ కూడా తీసుకోలేదు. నీ వల్ల నాకు ఎంత నష్టమో తెలుసా!" ఓ మధ్య వయస్సు గలాయన ముందుకొచ్చి అరుస్తుంటే ఆయన భార్య వెనుక వచ్చి నిలబడి వింటున్నది. చిట్టిబాబు మెల్లగా సైగచేసి చూపించారు ఆయన వెనుక నిలబడిన ఆయన భార్యను. ఆయన పిల్లిలా మెల్లగా జారుకున్నాడు కంగారు పడుతూ.

చిట్టిబాబు మీద తలో చెయ్యెయ్య బోయారు. అంతలో రమణి కల్పించుకున్నది.

"ఆగండాగండి! ఈయనకు హిస్టీరియ వున్నది. అందుకే అలా అరిచారు. ఇప్పుడే హాస్పటల్ కు తీసుకెళ్ళి వస్తున్నాను. చల్లగా వున్నది కదు అని ఇటు వచ్చాం" అందరు ఒకరి మొహం ఒకరు చూసుకుని వెళ్ళిపోయారు.

"ఇక్కడ స్థలం అచ్చి రాలేదు. అలా వెళ్ళి ఐస్‌క్రీమ్ తిందాం రండి" అంటూ లేచి నిలబడ్డాడు. ఆమె అతన్ని అనుసరించింది.

ఇద్దరు ఒకరికెదురుగా ఒకరు కూర్చున్నారు ఏం మాట్లాడాలో ఇద్దరికీ అర్థం కావడం లేదు.

"మీరు పాటలు పాడుతారా?" రమణి అడిగింది.

"పాటలంటే... పాడతాను" నసిగాడు.

"అయితే ఓ పాట పాడండి."

"వద్దులెండి. అసలే ఇది పార్కు. ఇప్పటికే ఓ ప్రమాదం తప్పింది"

ఐస్‌క్రీమ్ తినిపిస్తానని ఇలా గాలి తినిపిస్తున్నారేమిటి?"

"అవునవును. మర్చిపోయాను." అని గట్టిగా బోయ్ ని పిలిచాడు.

అతను కళ్ళు నలుపుకుంటూ ఏడుపు మొహం పెట్టుకుని, ఆవులించుకుంటూ వచ్చాడు.

"బంగారంలాంటి నిద్ర పాడు చేశారు సార్. చిలకా గోరింకల్లా వున్నారు, గంటలు గంటలు అలా కూర్చుని మాట్లాడుకుంటారేమోనని అలా కునుకు తీస్తున్నాను" విచారంగా చెప్పాడు.

వాడి మాటలకు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"అలా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసుకునే వారు చూసుకోవడం పూర్తయిన తరువాత పిలవక పోయారా నాకు నిద్ర బద్దకం వదిలిపోయేది" విరాగ్గా అన్నాడు వాడు.

ఇద్దరు తడబడి ఈ లోకంలోకొచ్చారు.

"అప్పుడే చూసుకోవడం అయిపోయిందా? మీరేం ప్రేమికులండీ బాబూ! కళ్ళల్లో కళ్ళు పెట్టి ఓ గంట కూర్చుని, ఒకే ఐస్‌క్రీమ్ తీసు
కుని ఒకరికి ఒకరు తినిపించుకుంటూ సరసాలాడుకుంటారు ఇక్కడొచ్చే లవర్స్. మీకు బొత్తిగా ప్రేమించుకోవడం తెలిసినట్లు లేదే! మీరు ఇవాళ నుండి ఓ వారం రోజులు కాలేజీకి నామం పెట్టి వరసగా తెలుగు సినిమాలు చూడండి. అప్పటికీ అర్థం కాకపోతే నా దగ్గరకు రండి ట్రైనింగ్ యిస్తాను" చిట్కార్చాడు అతను.

అయిపోయిందా అన్నాడు చిట్టిబాబు.

"అయిపోయింది. నేను చెప్పినట్లు ప్రేమించుకుంటారు! మళ్ళీ నేనొక కునుకు తీస్తాను."

"ఐస్‌క్రీమ్ తెస్తావా లేక వెళ్ళి పొమ్మంటావా?" విసుక్కున్నా చిట్టిబాబు వాడు ఏమనుకున్నారో ఏమో? తెచ్చి వారి ముందుంచి, చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు.

"ఇక నువ్వెళ్ళ వచ్చు" అన్నాడు చిట్టిబాబు. అతనికి రాక రాక వచ్చిన అవకాశం ఆమె ముందు గొప్పగా ఫీలవాలని మనసులో కోరిక.

"లవర్స్ ఐస్‌క్రీమ్ ఎలా తినాలో తెలియదేమో చెబుదామని ఆగానంతే!" అన్నాడు వాడు.

"అయితే తినిపించు" అన్నాడు చిట్టిబాబు కోపంగా.

"ఓస్ మీకభ్యంతరం లేకపోతే నాకేంటి! మీరు తప్పుకోండి" అంటూ ముందుకొచ్చాడు.

"పళ్ళు పీకుతాను. కాళ్ళు నరుకుతాను. చెంప పగలగొడతాను. పెద్ద పోటుగాడు దిగి వచ్చాడు. పో అవతలకు. ఒకసారి మొహాన్ని అద్దంలో చూసుకో" బి.పి. పెరిగి గట్టిగా అరిచాడు చిట్టిబాబు.

వాడు కంగారుపడి దూరంగా పారిపోయి నిద్ర కుపక్రమించాడు.

ఏమిటో దరిద్రం. నాకు ఇలాంటి వాళ్ళు దొరుకుతారు కాబోలు. ఎంచక్కా హీరోలా నడుచుకోవాలనుకుంటే లేకితనం బయట పడతాయి. వెధవ జాతకం. వెధవ జాతకం. అని తిట్టుకున్నాడు చిట్టాబాబు.

## బర్త్‌డే గ్రీటింగ్స్

పేరు: పావని.జి., తల్లితండ్రులు: బాలస్వామి, సావిత్రి, పుట్టినరోజు: 5–8–91, చిరునామా: అప్పరాల, తా: వనపర్తి, జిల్లా: మహబూబ్‌నగర్.



పేరు: కె. కవిత (చిట్టి), పుట్టినతేదీ: 12–01–86, తల్లితండ్రులు: కె. పుష్ప, కె. కృష్ణమూర్తి, చిరునామా: 12–11–629/254, వారసిగూడా, సికింద్రాబాద్.



పేరు: గ్రంధిసారిక, పుట్టినరోజు: 20–9–92, తల్లిదండ్రులు: జి.బి.యస్. రామానుజగుప్త, వరలక్ష్మి, ఇ.నెం. 26–11–6 కంబాలపేట, రాజమండ్రి.

